## క్లుప్తంగా...

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: నూతన్‌కల్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల నరికివేత, మరమ్మత్తుల కారణంగా శుక్రవారం సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ పవన్ చంద్ తెలిపారు. నూతన్‌కల్‌తో పాటు గ్రామ పరిధిలోని కమర్షియల్, ఇండస్ట్రియల్, అగ్రికల్చర్ సర్వీసులకు కరెంట్ సరఫరా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఉండదని ఏఈ తెలిపారు.

### యూజీసీ వేతనాలు చెల్లించాలి

ఘట్‌కేసర్: సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు యూజీసీ వేతనాలు చెల్లించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ స్టాఫ్ అసోసియేషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ వినయ్ బాబును గెలిపించాలని కోరుతూ గురువారం ప్రచారం చేశారు. అధ్యాపకులకు హెల్త్‌కార్డులు, స్కేల్ వర్తింపచేయాలని, నివాస గృహాలు నిర్మించాలన్నారు. ఉద్యోగ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 'డబుల్' ఇళ్ల సముదాయాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



యాద్గార్‌పల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కీసర: యాద్గార్‌పల్లి గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యన్ తెలిపారు. గురువారం ఆయన యాద్గార్‌పల్లి గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల గృహసముదాయాలను సందర్శించి అక్కడ నివసిస్తున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను వివరించారు.

### విద్యార్థులకు అవగాహన

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపం వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు.కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రీతు, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ రేచల్, తదితరులు పాల్గొన్నారు.

### నగరంలోని స్కూల్స్‌తో యులిప్స్

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే తొలి ఓటీటీ తరహా లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌గా ప్రారంభమైన యులిప్స్.. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగానూ పాఠశాలలతో భాగస్వామ్యం ఏర్పర్చుకుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా చదువుతో పాటు విద్యార్థుల సమగ్ర నైపుణ్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా ఇప్పటికే 200 పాఠశాలలతో కలిసి పనిచేస్తున్నామని, ఒకటి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు ఉపకరించే స్కిల్స్ అందించేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలు డిజైన్ చేశామన్నారు.

### మార్చి 3 వరకు ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు జరుగనున్నాయని ఆలయ అధ్యక్షుడు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డిలు ఓ ప్రకటనలో తెలియజేశారు. 24న శ్రీదాసాంజనేయస్వామి నూతన విగ్రహ యంత్ర ప్రతిష్ఠ, 25న శ్రీవిష్వక్సేన ఇష్టి, 26న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సం, సాయంత్రం గరుడ సేవ, 27న శ్రీవాసుదేవ ఇష్టి, శ్రీమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, 28న శ్రీగోదావరి అమ్మవారికి అభిషేకం, మార్చి 1వ తేదీన అపమృత్యు దోష నివారణ, శ్రీనృసింహేష్టి, శ్రీవారికి లక్ష పుష్పార్చన, తులసీ దళార్చన, 2వ తేదీన శ్రీసుదర్శన ఇష్టి, మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, చక్రస్నానం, శ్రీపుష్ప యాగం, ద్వాదశారాధన, ధ్వజారోహణం, 3వ తేదీన శ్రీవెంకటేశ్వరస్వామికి అభిషేకం, అష్టోత్తర శత ఘటాభిషేకం ఉంటుందన్నారు.

### డా.రాజ్‌వీర్‌కు బెస్ట్ మెజీషియన్ అవార్డు

కుత్బుల్లాపూర్: ఇంటర్నేషనల్ మెజీషియన్ డేను పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మెజిషియన్, సైకాలజిస్ట్ డాక్టర్ రాజ్‌వీర్ బెస్ట్ మెజీషియన్ సర్టిఫికెట్ పొందారు. ఐఏఎస్ అధికారి బి.వెంకటేశం, ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆయనకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

# తెలంగాణలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం

శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణాలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం క్రీడాకారులు ప్రోత్సహిస్తోందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గాజులరామారంలో రావులశేషగిరి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శంభీపూర్‌లోని కార్యాలయంలో ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు విజేతలుగా నిలిచిన జట్లకు గురువారం ట్రోఫీ, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో ప్రతిభ కనబరిచి తమ ప్రాంతానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజుయాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, మాజీ కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, పాలకృష్ణ, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షులు విజయ్‌రామ్‌రెడ్డి, మహ్మద్ రఫీ, మాజీ సర్పంచ్ జక్కుల కృష్ణయాదవ్, నాయకులు యాదగిరి, బంటి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు విస్తరణను 40ఫీట్లకు తగ్గించండి..**

◆ కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లికి చెందిన ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుని కలిశారు. రోడ్డు విస్తరణతో తమ ఇళ్లు, జీవన ఉపాధి ఇస్తున్న దుకాణాలను కోల్పోతున్నామని.. 50 ఫీట్ల వెడల్పుకు బదులుగా 40 ఫీట్లకు తగ్గించేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

**జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి..**

◆ శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును టీయూడబ్ల్యూజేహెచ్-143, టీఎస్‌యూడబ్ల్యూజే, టీజేయూఎఫ్ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ సంఘాల నేతలు అస్కాని మారుతిసాగర్, రంగు వెంకటేష్‌గౌడ్, సుధీర్ మంకాల, కె.వెంకట్, గడ్డమీది బాల్‌రాజ్‌గౌడ్, కోటగడ్డ శ్రీనివాస్, శేఖర్, చింతల్ శ్రీను, అశోక్, శివాజీ తదితరులు ఉన్నారు.

### ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు

తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టిన శంభీపూర్ రాజును గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 8వ డివిజన్‌కు చెందిన కృష్ణకు సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.2 లక్షల చెక్కును గురువారం మంత్రి మల్లారెడ్డి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి అందచేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిశెట్టి మహేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచారం: సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను లబ్ధిదారులకు చైర్మన్ కొండల్‌రెడ్డి గురువారం అందజేశారు. అన్నోజిగూడకు చెందిన గుగులోత్ రాహుల్‌కు రూ.47500, నారపల్లికి చెందిన చందుకు రూ. 45000, బౌరమ్మకు రూ. 37500 చెక్కులు అందజేశారు. కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు పోచమ్మ, రవీందర్, సుధాలక్ష్మి పాల్గొన్నారు.

# వీధికుక్కల బెడద నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో వీధికుక్కల సమస్యను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డిలు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, శానిటేషన్ జవాన్లతో సమావేశం నిర్వహించారు. కుక్కల సంతాన నియంత్రణకు స్టెరిలైజేషన్ ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

### చకచకా తవ్వి.. నిర్లక్ష్యంగా వదిలేసి..



అల్వాల్: అసలే ఇరుకైన రోడ్డు.. పైగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం.. పక్కనే లాయోలా కాలేజీ.. నిత్యం పెద్దఎత్తున విద్యార్థుల రాకపోకలు.. ఓల్డ్ అల్వాల్‌లోని ఫాదర్ బాలయ్యనగర్‌లోని తిరుమల ఎన్‌క్లేవ్ వద్ద జీహెచ్‌ఎంసీ వారు నాలా నిర్మాణ పనుల కోసం గుంతను తవ్వారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకుండా, గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో అటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు, సమీపంలోని లయోలా కాలేజీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆ గుంత కారణంగా రోడ్డు ఇరుగ్గా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

### సన్మార్గంలో నడవాలి

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సన్మార్గంలో నడిచేలా హరేరామ హరేకృష్ణ ఇస్కాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. జీవితంలో మార్పు అవసరమని, సమాజంలో ఉన్నతంగా జీవించాలని అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో నైతిక విలువలను పొందించుకోవచ్చని చెప్పారు. జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీరామసకదాసు, సుధాకర్, దీపక్‌కుమార్, మహబూచదాసు, జైలు ఉప పర్యవేక్షణాధికారులు శశికాంత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# కంటి వెలుగు శిబిరం పేదల పాలిట వరం



కంటి వెలుగును పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: కంటి వెలుగు శిబిరం పేదల పాలిట వరమని చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డులో కమిషనర్ వేమనరెడ్డితో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కంటి వెలుగులో ప్రతి ఒక్కరు తమ కళ్లను పరీక్షించుకోవాలని, అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శశికళ, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ మీనా పాల్గొన్నారు.

# నాలా విస్తరణపై నిపుణుల కమిటీ వేయాలి



డీసీతో సమావేశమైన కార్పొరేటర్, కాలనీవాసులు

మల్కాజిగిరి: విష్ణుపురికాలనీలో నాలా విస్తరణపై నిపుణుల కమిటీ వేసి నిర్ణయించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సర్కిల్ డీసీకి విజ్ఞప్తి చేశారు. సర్కిల్ కార్యాలయంలో కాలనీవాసులతో కలిసి గురువారం సమావేశమయ్యారు. సినీపోలీస్ నుంచి విష్ణుపురి కాలనీ మీదుగా జరుగుతున్న నాలా విస్తరణతో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని ఆయన దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. విష్ణుపురి కాలనీ క్రింది ప్రాంతాల మీదుగా వెళ్లే నాలా నిర్మాణం గ్రావిటీ లేకపోతే పైన ఉన్న కాలనీల్లో నీరు నిలిచే అవకాశం ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగం నిపుణుల కమిటీ పరిశీలించిన తర్వాత నాలా విస్తరణ పనులు చేపట్టాలని కోరామన్నారు. సమావేశంలో డీఈ మహేష్, ఏఈ దీపక్, కాలనీవాసులు మురళీమోహన్, అఖిల్, హనుమాన్, మూర్తి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### చదువు, క్రీడలు రెండూ ముఖ్యమే..

మేడిపల్లి: చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని అరోరా కాలేజీ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ, క్రీడా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అవుషాపూర్ అరోరా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ ప్రభు, స్పోర్ట్స్ మీట్ కన్వీనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణారెడ్డి, కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### 13వ డివిజన్ అభివృద్ధికి రూ.3.86 కోట్లు

బోడుప్పల్: 13వ డివిజన్‌లో రూ.3.86 కోట్లతో మౌలిక వసతులు కల్పించినట్లు కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి అన్నారు. కార్పొరేటర్‌గా మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.1.84 కోట్లు, వాటర్ ట్యాంక్, తాగునీరు, పైపులైన్ల నిర్మాణం కోసం రూ.1.56 కోట్లు, హరిత హారంలో మొక్కల ఏర్పాటుకు రూ.25 లక్షలు, బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.9 లక్షలు, హైమాస్ట్ లైట్ల కోసం రూ.7 లక్షలు, సీసీ కెమెరాలకు రూ.5 లక్షలు ఖర్చుచేసినట్లు వెల్లడించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డి సహకారంతో తన డివిజన్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రానున్న రెండేళ్లలో డివిజన్ పరిధిలో మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామన్నారు.

### ఉప్పల్‌లో నీటి తిప్పలు అధికారులూ స్పందించరూ..

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మరికొన్ని చోట్ల లో ప్రెషర్ ఉందని, ఉప్పల్ విజయపురి కాలనీలో 15 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి గురువారం స్థానికులతో కలిసి జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్, డీజీఎం రజినీకాంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. లక్ష్మీనారాయణ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఎండాకాలం రాకముందే శాంతినగర్, విజయపురి కాలనీవాసులు నీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎ- బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంపదపై విద్యార్థులకు అవగాహన



అటవీ సంపద గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

పోచారం: నారపల్లిలోని భాగ్యనగర్ నందనవనం పార్కులో అటవీ సంపదపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కస్నా మాట్లాడుతూ.. ఎంతో అమూల్యమైన అటవీ సంపద గురించి ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భావి తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరిత హారం కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. వనిత మహావిద్యాలయ పరిశోధన విభాగం అధ్యాపకులు షిప్రా జోన్స్ తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛత.. అందరి బాధ్యత



కుషాయిగూడ: సమష్టి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని అణు ఇంధన కేంద్రీయ విద్యాలయ స్కూల్-1 ప్రిన్సిపల్ రోమా కథపా అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల సందర్భంగా అణు ఇంధన సంస్థ(ఎన్‌ఎఫ్‌సీ), అణు ఇంధన కేంద్రీయ విద్యాలయ సంయుక్తాధ్వర్యంలో గురువారం డీఏఈ కాలనీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. హెడ్ మిసెస్ సోనియా కపూర్, ఎం.ఎల్. శర్మ, ఇంద్ర, అహ్మద్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



భాస్కర్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ గురువారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మెదక్ జిల్లా, శివ్వంపేట మండలం, శభాశ్‌పల్లి గ్రామానికి చెందిన భాస్కర్ (40) జీవనోపాధి కోసం మేడ్చల్ లో జీవనం సాగిస్తున్నాడు. తను అద్దెకు ఉంటున్న ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్

ఘట్‌కేసర్: కొర్రెముల్ పంచాయతీలో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్లను కూల్చివేయించాలని పాలకవర్గం తీర్మానించింది. కొర్రెముల్ పంచాయతీ కార్యలయంలో గురువారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆదాయ, వ్యయాలు, గ్రామాభివద్ధిపై చర్చించారు. జెడ్పీ స్కూల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మా ణం చేపట్టాలని, గ్రామంలో డ్రైనేజీలకు మరమ్మతు లు చేయించాలని తీర్మానం చేశారు. సమావేశంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, ఎంపీటీసీ వినోద, వార్డు సభ్యులు ఆంజనేయులు, ఈశ్వరీ, దుర్గారాజ్, భార్గవి, సునిత, భాస్కర్, స్వామి, సుష్మ, అరుంధతి, లక్ష్మీ, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

### అడవిలో అగ్ని ప్రమాదం.. 4 హెక్టార్లు దగ్ధం



శామీర్‌పేట్: కొల్తూర్ – పోతారం ఫారెస్ట్‌లో గురువారం మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన మేరకు.. మూడుచింతలపల్లి మండల పరిధిలోని కొల్తూర్ – పోతారం గ్రామంలో ఉన్న అడవిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు సంబంధిత అధికారులతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్, స్థానిక యువకులు మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు 4 హెక్టార్ల అటవీ ప్రాంతం దగ్ధమైందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

### ఆక్రమణలపై అధికారుల ఆగ్రహం

ఉప్పల్: ఉప్పల్ బగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలను అధికారులు గురువారం కూల్చివేశారు. బగాయత్ లే అవుట్‌లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అద్దెలకు ఇచ్చుకుంటున్నారనే ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హెచ్‌ఎండీఏ, ఉప్పల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సంయుక్తంగా నిర్మాణాలను కూల్చివేశారు. ఆక్రమణదారులను అలాగే వదిలేశారని, చిన్న టీ కొట్టులాంటి వాటిని కూల్చివేసి పేదోళ్ల పొట్టకొట్టారని పలువురు విమర్శించారు.




ఉప్పల్ బగాయత్ లే అవుట్‌లో నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

# నట్టల నివారణ మందు పంపిణీ



ఘట్‌కేసర్: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నట్టల నివారణ మందును గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. గురువారం ఘట్‌కేసర్‌లో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డితో కలిసి జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పద్మిని, జంగయ్యయాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు వీరేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌యాదవ్, నాగునాయక్, గణేశ్ పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో మేడ్చల్ దాక్షాయని రామలింగేశ్వరస్వామి ఆలయం

# నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మేడ్చల్: మేడ్చల్‌లో ప్రఖ్యాతి గాంచిన దాక్షాయని సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర)శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధాత్రిక కాశీనాథ్ తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. అధికారులు, దేవాలయ కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు.



దాక్షాయని రామలింగేశ్వరస్వామి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387